క్లుప్తంగా

పండుగ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ రాంనర్సింహారెడ్డి

మామడ: ఈనెల 18న మహాశివరాత్రి పండుగ నేపథ్యంలో బూరుగుపల్లి శివాలయం వద్ద చేపట్టే ఏర్పాట్లను ఆదివారం సీఐ రాంనర్సింహారెడ్డి పరిశీలించారు. ఆలయం, కోనేరు వద్ద భక్తుల సందడి ఉంటుందని.. ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్సై అశోక్‌కు సూచించారు.

'డబుల్'కు దరఖాస్తు చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం అర్హులైన లబ్ధిదారులు ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రాజమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోనివారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ముధోల్: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమార ప్రసాద్ దిష్టిబొమ్మను మండలంలోని తరోడ గ్రామంలో ఆదివారం దహనం చేశారు. బస్టాండ్ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో భీం ఆర్మీ నాయకులు పరమేశ్వర్, నికిల్, బీఎస్పీ నాయకులు సంజీవ్, శ్రీధర్, నితిన్, వినోద్ తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన సప్తాహం



సప్తాహంలో పాల్గొన్న సభ్యులు

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాథ్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం అఖండ హరినామ సప్తాహం ఘనంగా ప్రారంభించారు. ఏడురోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని.. గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. నిత్యం ఉదయం గాథ భజన, కీర్తనలు.. సాయంత్రం జ్ఞానేశ్వరి పారాయణం నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, రమేశ్, ఆనంద్‌పాటిల్ ఉన్నారు.

పత్రాలు వెంట ఉంచుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై శ్రీకాంత్

భైంసారూరల్: వాహనదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలను కలిగి ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని దేగాం గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. పెండింగ్ చలాన్లు చెల్లించి.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది ఉన్నారు.

ఆర్ఎంవోకు సన్మానం

లక్ష్మణచాంద: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ గోపాలకృష్ణను సోన్ సీఐ రాంనరసింహారెడ్డి ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో ఉత్తమ వైద్యుడిగా గోపాలకృష్ణ ఎంపికవడంతో ఆదివారం సోన్ సర్కిల్ కార్యాలయంలో ఆయనను సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై రవీందర్ సన్మానించారు. సీఐ మాట్లాడుతూ అనేక పురస్కారాలు పొందడంతో పాటు పోలీస్‌శాఖ తరఫున అవగాహన కార్యక్రమాల్లో ఆర్ఎంవో పాల్గొన్నారని అన్నారు. మామడ ఎస్సై అశోక్, సిబ్బంది భీ మేశ్, సంజీవ్‌కుమార్, భరత్, విశ్వనాథ్, శ్రీనివాస్, ప్రియాంక, సిద్ధూ, కలీం పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొట్టిన బస్సు



ఘటనా స్థలం వద్ద బస్సు

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తా వద్ద ఆదివారం మధ్యాహ్నం ఓ ప్రైవేటు బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా.. స్తంభం తాత్కాలికంగా విరిగి పెనుప్రమాదం తప్పింది. రోజంతా విద్యుత్, ఇంటర్‌నెట్ సేవలకు తీవ్ర అవాంతరం ఏర్పడింది. విద్యుత్ అధికారులు రాత్రి తొమ్మిది గంటల వరకు కష్టపడి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కీరదోస కేరాఫ్ కనకాపూర్

- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు
- జాతీయ రహదారిపైనే విక్రయం
- మంచి ఆదాయం పొందుతున్న రైతులు



దోసకాయలు విక్రయిస్తున్న రైతు



కనకాపూర్‌లో సాగవుతున్న దోస పంట

లక్ష్మణచాంద: మూస ధోరణిని వదిలిపెట్టి.. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కీరదోస పంట సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు కొందరు రైతులు. పంట సాగు చేయడమే కాక స్వయంగా రైతులే తమ పంటను విక్రయించుకుంటూ కష్టానికి ప్రతిఫలం పొందుతున్నారు లక్ష్మణచాంద మండలంలోని కనకపూర్ గ్రామంలో.

ఏటా సాగు..

మండలంలోని కనకపూర్ గ్రామం నిర్మల్ నుంచి మంచిర్యాల వెళ్లే జాతీయ రహదారిని ఆనుకొని ఉంటుంది. దీంతో నిత్యం ఈ రోడ్డుపై వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు మండలంలోని అన్ని గ్రామాలకు ముఖద్వారం కనకపూర్ గ్రామం కావడంతో ఇక్కడ రైతులు భిన్నంగా పంటల సాగుకు మొగ్గు చూపుతారు. ప్రతి సంవత్సరం వేసవిలో కీరదోస సాగు చేసి ఆదాయం పొందుతున్నారు.

వేసవిలో డిమాండ్..

వేసవిలో కీరదోసకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇందులో నీటిశాతం ఎక్కువ ఉండటంతో దీన్ని తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతారు. గ్రామానికే చెందిన సుమారు 30 మంది రైతులు దోసకాయ సాగు చేసి మార్కెట్‌కు తరలించకుండా తామే రోడ్లు, కూడళ్ల వద్ద విక్రయిస్తూ మంచి ధర పొందుతున్నారు.

45 రోజుల్లో పంట చేతికి..

మిగిలిన పంటల కంటే తక్కువ సమయంలో సాగయ్యే పంట దోస. ఇది విత్తిన 45 రోజుల్లోనే పంట చేతికి వస్తుంది. ఎక్కువ మంది రైతులు పది గుంటలకు తగ్గకుండా దీనిని సాగు చేస్తున్నారు. ఉదయం ఈ తోట సంరక్షణ చూసుకుంటూ ఇతర పనులు చేసుకుంటున్నారు. పంట చేతికి వచ్చిన తర్వాతే జాతీయ రహదారిపై ఉండి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి కీరదోస కిలోకు రూ.65 నుంచి రూ.70 వరకు ధర పలుకుతోంది.

తక్కువ పెట్టుబడి..

వాణిజ్య పంటల సాగుతో పోలిస్తే.. కీరదోసకు తక్కువ పెట్టుబడి అవుతుంది. ఎకరంలో పంట సాగుకు కేవలం రూ.ఐదు నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు.

మధ్యవర్తులు లేకపోవడంతో రైతులే నేరుగా తమ గ్రామంలోని బస్టాండ్‌లో అమ్ముతున్నారు. తాము పెట్టిన ఖర్చులు పోనూ ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

సేంద్రియ ఎరువులతో..

ప్రజల ఆరోగ్యానికి నష్టం చేకూర్చే రసాయనాల జోలికి వెళ్లకుండా సేంద్రియ ఎరువులను సాగుకు వినియోగిస్తున్నామని రైతులు తెలుపుతున్నారు. దీంతో పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ శ్రమతో సాగు



వేసవిలో ఈ పంట సాగు చేయడం వలన తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు గడించవచ్చు. ఈ పంట సాగుకు ఎక్కువ రసాయన ఎరువులు వినియోగం ఉండదు. తక్కువ ఖర్చు.. తక్కువ శ్రమతో ఈ పంటను సాగు చేస్తున్నాం. - రాజు, కనకాపూర్

ఎకరంలో సాగు చేశా



ఇతర పంటలతో పోల్చుకుంటే ఈ పంట సాగుతో ఆదాయం బాగుంది. తక్కువ సమయంలో ఎక్కువ లాభం వస్తుంది. ఎకరంలో కీరదోస పంట సాగు చేశాను. రోజువారీ ఖర్చులు పోనూ మంచి ఆదాయం వస్తుంది.

- రఘు,కనకాపూర్

అటెన్షన్ ప్లీజ్.. వృథాగా భగీరథ జలం



తానూరు: మండలంలోని హిప్నెల్లితండా గ్రామానికి సరఫరా చేసే భగీరథ నీరంతా వృథాగా పోతోంది. అధికారులు తానూరు ఎక్స్‌రోడ్డు నుంచి హిప్నెల్లితండాకు భగీరథ పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వకపోవడంతో పైపులోంచి వచ్చే నీరంతా వృథా అవుతోంది. అధికారులు పైపులైన్‌ను ట్యాంకుకు అనుసంధానించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: పృథ్వీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఫోన్: 9985665568

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- కడెం ఆసుపత్రిలో జాడ లేని 108 అంబులెన్స్
- సకాలంలో అందని వైద్యం
- సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్న ప్రజలు



కడెం ఆసుపత్రిలో బైక్ అంబులెన్స్

కడెం: అత్యవసర సమయంల్లో ప్రాణం పోసే అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో పలువురి ప్రాణాలు పోతున్నాయి. కడెం ఆసుపత్రిలో ఉన్న అంబులెన్స్‌ను తరలించడంతో ఏళ్లుగా కడెం, దస్తురాబాద్ మండలాల ప్రజలకు 108 అంబులెన్స్ సేవలు దూరమయ్యాయి. దీంతో ఆపదలో 108కు కాల్ చేసినా ఖానాపూర్ నుంచి రావడంతో..సకాలంలో వైద్యం అందక అక్కడికక్కడే ప్రాణాలు పోయిన ఘటనలెన్నో ఉన్నాయి.

కడెం నుంచి తరలింపు..

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 108 అంబులెన్స్ ప్రవేశపెట్టిన సమయంలోనే కడెం ఆసుపత్రికి సైతం ఓ అంబులెన్స్ కేటాయించారు. కొన్నేళ్ల పాటు సేవలు అందించిన తర్వాత దానిని కడెం నుంచి వేరే చోటకు తరలించారు. దీంతో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు ఒకే 108 అంబులెన్స్ ఉండడంతో దూరభారం అవుతుంది.

ఖానాపూర్ నుంచి కడెం, దస్తురాబాద్ మండలాల్లోని మారుమూల గ్రామాలకు రావాలంటే దాదాపు గంటకు పైగా సమయం పడుతుంది..బైక్ అంబులెన్స్‌ను కేటాయించిన అది ఘటన స్థలంలో ప్రథమ చికిత్స అందించేందుకు మాత్రమే పని చేస్తుంది. ప్రమాదానికి గురైన వ్యక్తికి మెరుగైన చికిత్స అందించేందుకు ఆసుపత్రులకు తరలించాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కవుతున్నాయి. దీంతో అందుబాటులో 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు.

పట్టించుకోవడం లేదు



కడెంలో కొన్నేళ్లుగా 108 అంబులెన్స్ లేక అత్యవసర సమయంలో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఖానాపూర్ నుంచి అంబులెన్స్ వచ్చేసరికి ప్రాణాలు పోతున్నాయి. అధికారులు, నాయకులు స్పందించి 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలి.

- ముక్కెర గంగాధర్, స్థానికుడు

త్వరలోనే ఏర్పాటు చేస్తాం

కడెంలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు ప్రతిపాదనలు పంపాం. నూతన వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. త్వరలోనే కడెంలో అంబులెన్స్ ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- మధు, 108జిల్లా ఇన్‌చార్జి

ఘనంగా బోనాల పండుగ



ముధోల్: తరోడలో బోనాలతో మహిళలు



భైంసారూరల్: ఇలేగాంలో బోనాలతో వెళ్తున్న భక్తులు

ముధోల్: మండలంలోని తరోడ, చించాల తదితర గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు ప్రత్యేక వాహనాల్లో గోదావరి నది నుంచి గంగాజలం తీసుకొచ్చారు. వీధుల్లోంచి ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ, మైసమ్మ, మహాలక్ష్మీ తదితర గ్రామదేవతలకు గంగాజలంతో అభిషేకం చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఖానాపూర్: మండలంలోని రాజుర గ్రామంలో ఆదివారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున సదర్‌బోనాలను సమర్పించారు. వీధుల గుండా డప్పుచప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నం లావణ్య, ఎంపీటీసీ రాజు, పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని హల్దా గ్రామంలో ఆదివారం ఎల్లమ్మ మందిరంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు, పురుషులు దొంతులతో మందిరం వరకు ఊరేగింపుగా వెళ్లారు. పోతరాజులు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీబాయి, జెడ్పీటీసీ చౌహాన్ ఆల్కాతాయి, శంకర్, రాజేశ్వర్, వీడీసీ అధ్యక్షులు గంగాధర్, సర్పంచ్ సాయన్న, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్: రాజుర గ్రామంలో..



దొంతులతో గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో ఆదివారం పోచమ్మ, మహాలక్ష్మీ, ఊరడమ్మ ఆలయాల్లో బోనాల పండుగ నిర్వహించారు. భక్తులు బోనాలతో వెళ్లి ఆలయాల్లో నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామదేవతలకు పూజలు జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యం, గ్రామస్తులు ఉన్నారు.

కనుల పండువగా ప్రతిష్ఠాపన

ముధోల్: మండల కేంద్రంలోని జటశంకర ఆలయ సమీపంలో గుట్టపై గణపతి దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ దేవత ఆరాధన, బలిహారం, సంప్రోక్షణ, మహా ఆశీర్వచనాలు వంటి పూజాది కార్యక్రమాలు జరిపారు. ముధోల్‌కు చెందిన బ్రహ్మేశ్వర పరివార్ ఆధ్వర్యంలో నిర్మించిన గుట్ట గణపతి ఆలయంలో జరిగిన ప్రతిష్ఠాపనకు భక్తులు తరలివచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు రామారావు పటేల్, వివిధ గ్రామాల భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.



ప్రతిష్ఠాపనలో వేద పండితులు, నాయకులు

అనంతరం ముధోల్‌కు చెందిన నవీన్.. భక్తులకు అన్నదానం చేశారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

- నిర్మల్‌టౌన్

ఓలాలో ప్రారంభమైన మహోత్సవం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ విఠలేశ్వర–రుక్మాబాయి స్థిర ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విగ్రహాలను మంగళహారతుల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి వేదమూర్తులు శ్రీ జోషి భగవాన్ మహరాజ్ ఆధ్వర్యంలో శాంతిపాఠం, మహాసంకల్పం, గణపతి ఆరాధన, నవగ్రహ, పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, జలాధివాసం, మంత్రపుష్పం, హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

సినిమాలు



తిరుమల : రైటర్ పద్మభూషణ్
నారాయణ: అమిగోస్
వెంకటేశ్: వాల్తేరు వీరయ్య

'అసెంబ్లీ తీర్మానం ఉపసంహరించుకోవాలి'

ఖానాపూర్: పలు బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే అసెంబ్లీ తీర్మానాన్ని తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కేవలం ఓటు బ్యాంకు రాజకీయం కోసమే ఈ తీర్మానాలను చేశారన్నారు. 15 బీసీ కులాలను ఎస్టీ జాబితాలో కలపాలని బీఆర్ఎస్ ప్రభుత్వ కుట్రను గిరిజనులంతా గమనించాలని కోరారు. గిరిజనులను మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ ఎత్తుగడలను గమనించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం వెనక్కి తీసుకోకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ గజ్జలమ్మ దేవి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, శివుని, అప్పారావుపేట్, హిమాయత్ నగర్ ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి పల్లకీసేవలో భక్తులు పాల్గొనగా ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదం అందించారు.

లక్ష్మణచాంద: రెండో అడెల్లిగా ప్రసిద్ధి గాంచిన మండలంలోని ధర్మారం మహాపోచమ్మ ఆలయం వద్ద భక్తులు పూజలు చేశారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నేటి నుంచి బీఎస్పీ యాత్ర

ఖానాపూర్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర ఈనెల 13 నుంచి 16 వరకు ఖానాపూర్ నియోజకవర్గంలో కొనసాగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాత్రలో భాగంగా నియోజకవర్గంలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్, కడెం, పెంబి, ఖానాపూర్ మండలాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. 70 శాతమున్న బహుజనులు ఏకమై రాజ్యాధికారం సాధించుకోవాలని కోరారు. యాత్రకు ప్రజాస్వామిక వాదులంతా మద్దతు ఇచ్చి జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో నేర రాజన్న, లక్ష్మి, కుక్కరికారి రాజేశ్, దొంగరి రంజిత్, ప్రతాప్, శివ, హారతి, మొగిలి, భరత్, ప్రశాంత్ ఉన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

నేడు ఎమ్మెల్యే రాక

లోకేశ్వరం: మండలంలోని హథ్‌గాం, రాయపూర్ కాండ్లీ, లోకేశ్వరం గ్రామాల్లో మన ఊరు–మన బడిలో భాగంగా చేపట్టే పనులకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం భూమిపూజ చేస్తారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తారని.. సకాలంలో హాజరవాలని కార్యకర్తలను కోరారు.

కుంటాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పనులు, గజ్జలమ్మ ఆలయ గాలిగోపురం నిర్మాణానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేస్తారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవాలని కోరారు.

నేడు జాతర

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కె)లో సోమవారం భీమన్న జాతర జరగనుంది. ఆదివారం భీమన్న గదలను ఎస్టీ సంఘ సభ్యులు గోదావరికి తరలించారు. అభిషేకం అనంతరం భీమన్న గదలను ఆలయంలో ప్రతిష్ఠిస్తారు. అనంతరం జాతర నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ : జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899